
సాక్షి బాపట్ల

శుక్రవారం, 29, సెప్టెంబర్, 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఏడు మండలాల్లో వర్షం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఫిరంగిపురం మండలంలో 14.8 మిల్లీమీటర్లు, కాకుమాను 5.6, చేబ్రోలు 4.4, వట్టిచెరుకూరు 4.2, దుగ్గిరాల 2.6, గుంటూరు పశ్చిమ 1, గుంటూరు తూర్పులో 0.2 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 28వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 131.2 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 212.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు,మూడు రోజుల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నేడు డీసీఎంఎస్ మహాజన సభ సమావేశం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మహాజన సభ సమావేశం చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన కన్నావారితోటలోని కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం తెలిపారు. పాలకవర్గ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) అధ్యక్షులు, ఇతర సొసైటీ అధ్యక్షులు, సంఘ సభ్యులు సమావేశానికి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

'సంక్షేమం-అభివృద్ధి'పై వర్సిటీలో నేడు సదస్సు

సాక్షి, అమరావతి: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం ఓపెన్‌మైండ్స్ (ఫర్ బెటర్ సొసైటీ) ఆధ్వర్యంలో సంక్షేమం – అభివృద్ధి అనే అంశంపై సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ప్రముఖ ఆర్థికవేత్త, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (న్యూపా) మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జంధ్యాల బీజీ తిలక్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.వెంకటరావు, సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు కేబీజీ తిలక్, ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు, ఏపీహెచ్ఈఆర్ఎంసీ మాజీ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈఓ డాక్టర్ ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రసంగించనున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాలమోహన్‌దాస్ ఆడిటోరియమ్‌లో ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి జరుగుతుందని ఓపెన్ మైండ్స్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నారై కోటా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎన్నారై కోటాలో ప్రవేశాలకు 2023–24 విద్యాసంవత్సరానికి గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎన్నారై కోటాలో మిగిలిన సీట్ల కోసం అక్టోబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌లో గానీ నేరుగా గుంటూరు శివారుల్లోని లాంఫాంలో ఉన్న విశ్వవిద్యాలయంలోగానీ సంప్రదించాలని రామారావు సూచించారు.

లోక కల్యాణార్థం మన్యుసూక్త హోమం



అమరావతి: సర్వమానవాళి సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని స్థానిక అమరేశ్వరాలయంలో గురువారం మన్యుసూక్తహోమం నిర్వహించారు. స్థానాచార్యుడు కౌశికచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధన, పుణ్యాహవాచన, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యుసూక్తహోమం నిర్వహించి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా తుళ్లూరుకు చెందిన పంచముఖ ఆంజనేయ భక్తబృందం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరు గోపీనాథశర్మ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాహనమిత్రకు ఇంధనం



ప్రభుత్వం సిద్ధం చేసిన వాహనమిత్ర నమూనా చెక్కు

రేషన్ వాహనాల డ్రైవర్లకూ సాయం



వాహనమిత్ర సాయం లబ్ధిదారుల ఖాతాల్లో శుక్రవారం జమకానుంది. ఇప్పటికే నాలుగు విడతల్లో 25,082 మందికి రూ. 25,08,20,000 నగదు జమచేసిన ప్రభుత్వం నేడు ఐదో ఏడాది నగదును జమచేయనుంది. ఈ ఏడాది జిల్లాలో 6,772 మంది లబ్ధిదారులకు రూ.6,77,20,000 నగదును జమచేయనుంది. ఈ ఏడాది రేషన్ వాహనాలు నడిపే డ్రైవర్లకూ వాహనమిత్ర నగదును జమచేస్తున్నారు.

–చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి

- వరుసగా ఐదో ఏడాది అమలు
- జిల్లాలో 6,772 మందికి ప్రయోజనం
- రూ.6.77 కోట్ల మేర లబ్ధి
- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

బాపట్లటౌన్: ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా భరోసాగా నిలుస్తోంది. ఏటా రూ.10 వేల చొప్పున సాయం అందిస్తోంది. వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఈ మొత్తం ఉపయోగపడుతోందని డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల ముందు ఆటో, ట్యాక్సీవాలాల ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ వాహనమిత్ర పథకం అమలుకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. ఏటా డ్రైవర్లకు చేయూత అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలుగా జిల్లాలోని 25,082 మంది లబ్ధిదారులకు రూ.25.08 కోట్లు అందించారు. శుక్రవారం ఐదో విడత సాయంగా 6,772 మందికి రూ.6.77 కోట్లు అందజేయనున్నారు.

ఇప్పటివరకు ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	జమచేసిన నగదు (రూ.లక్షల్లో)
2019–20	5,818	581.80
2020–21	6,556	655.60
2021–22	6,187	618.70
2022–23	6,471	647.10

ప్రస్తుతం నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.లక్షల్లో)
అద్దంకి	1,159	115.90
చీరాల	1,271	127.10
పర్చూరు	916	91.60
బాపట్ల	1,168	116.80
వేమూరు	1,182	118.20
రేపల్లె	1,076	107.60

జాషువా సామాజిక ఉద్యమకారుడు

బాపట్లటౌన్: మహాకవి గుర్రం జాషువా గొప్ప సామాజిక ఉద్యమకారుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గుర్రం జాషువా 128వ జయంత్యుత్సవం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పిరదౌసి, గబ్బిలం వంటి ఎన్నో రచనలతో ప్రజల ఆలోచనలలో జాషువా మార్పు తెచ్చారన్నారు. జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజదిబోర, కలెక్టరేట్ ఏవో గోపీకృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్

స్వామినాథన్‌కు తెనాలితో 'విశిష్ట' బంధం

నాయుడమ్మ విశిష్ట పురస్కారం స్వీకరించిన హరిత విప్లవ పితామహుడు

తెనాలి: హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు తెనాలితో విశిష్ట అనుబంధం ఉంది. తెనాలికి చెందిన ప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పేరిట విశిష్ట శాస్త్రవేత్తలకు బహూకరించిన అవార్డును స్వీకరించిన వారిలో డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఒకరు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ ట్రస్ట్ పేరిట సంస్థ వ్యవస్థాపకుడు పి.విష్ణుమూర్తి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన శాస్త్రవేత్తలు 24 మందికి నాయుడమ్మ అవార్డులను బహూకరించారు. చివరగా 23వ అవార్డును ఇద్దరు విశిష్ట మహిళా శాస్త్రవేత్తలకు ప్రదానం చేశారు. ఇండో–జపనీస్ రిలేషన్స్ నేషనల్ కౌన్సిల్ మెంబరుగా పి.విష్ణుమూర్తి, 1986లో నాయుడమ్మ అవార్డును ప్రవేశపెట్టారు. 1988వ సంవత్సరానికి సంబంధించిన మూడో అవార్డును ఆ మరుసటి సంవత్సరం జనవరిలో డాక్టర్ స్వామినాథన్‌కు అందజేశారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్‌కు, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు అధ్యక్షుడి హోదాల్లో డాక్టర్ స్వామినాథన్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఇక్కడి కొత్తపేటలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో 1989 జనవరి 30న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఏపీ టానరీస్ లిమిటెడ్ డైరెక్టర్ రతీష్ వై.నాయుడమ్మ చేతులమీదుగా డాక్టర్ స్వామినాథన్‌కు అవార్డును బహూకరించారు. కిక్కిరిసిన ఈ సభలో డాక్టర్ స్వామినాథన్ 'ఫ్రంటియర్ టెక్నాలజీస్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై 3వ నాయుడమ్మ స్మారక ఉపన్యాసం చేశారు. గ్రామీణ భారతదేశ పర్యావరణ భద్రతను పటిష్టం చేయటానికి ప్రణాళికాబద్ధమైన కృషి అవసరమని డాక్టర్ స్వామినాథన్ చెప్పారు. మహాత్మాగాంధీ సామూహిక ఉత్పత్తి అనే భావనను సాంకేతికత సమ్మేళనంలో మరింత ఎక్కువ ప్రయత్నాలతో గ్రామస్థాయిలో రాజకీయ కార్యక్రమాలుగా మార్చవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రయోజనం కోసం తమకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసే జాతీయ గ్రిడ్ పరిశోధన, శిక్షణ కేంద్రాలు అవసరమని వివరించారు. దేశంలో పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార ధాన్యాల ఉత్పత్తికోసం పదిరకాల సవాళ్లను వివరించారు. నాటి సభలో ప్లానింగ్ కమిషన్ సభ్యుడు, ఇండో జపాన్ స్టడీ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అబిద్ హుస్సేన్, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.అప్పారావు, ఏపీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ చైర్మన్ యూవీ వర్మ ప్రసంగించారు.



తెనాలిలో నాయుడమ్మ అవార్డును స్వీకరించిన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ (ఫైల్)

ఆత్మహత్యలు పరిష్కారం కాదు

- బైక్‌పై దేశవ్యాప్తంగా పర్యటించిన నెల్లూరు యువకుడు కార్తీక్
- యువత ఆత్మహత్యలకు పాల్పడకుండా చైతన్యం కల్పించడమే లక్ష్యం
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదుకు కృషి

చీరాల రూరల్: దిచక్ర వాహనంపై దేశం మొత్తం పర్యటించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించేందుకు యువకుడు కృషి చేయడం చిన్న విషయం కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించి గురువారం రాత్రి చీరాల గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్న నెల్లూరుకు చెందిన టి.వెంకట కార్తీక్‌ను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పూలమాలలు, శాలువాలువేసి సత్కరించారు. భారీగా బాణ సంచా కాల్చి వెంకట కార్తీక్ వెన్నుతట్టి తమవంతు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకట కార్తీక్ మాట్లాడుతూ సమాజంలో నేటి యువత చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకుని తనువు చాలిస్తున్నారని, అటువంటి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకు తాను దేశం మొత్తం పర్యటించినట్లు చెప్పారు. తన పర్యటన 14 ఫిబ్రవరి 2022న నెల్లూరులో ప్రారంభించినట్లు చెప్పారు. రెండు రోజుల్లో తన యాత్ర పూర్తవుతుందని, యాత్ర పూర్తయిన వెంటనే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం పేరు నమోదు చేయించుకోనున్నట్లు చెప్పారు. 580 రోజుల్లో 135 వేల కిలోమీటర్ల యాత్ర పూర్తిచేసినట్లు తెలిపారు. తాను చేస్తున్న ఈ యాత్రలో ఆర్థికంగా ఎవరి సహకారమూ తీసుకోలేదని, తన తండ్రి సహకారంతోనే యాత్ర పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హుమయూన్ కబీర్, డేగల చిన్న, మోహన్, ఆనంద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు గొప్ప పర్యాటక ప్రాంతం



విల్లు నుంచి బాణాన్ని సంధిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి
- చారిత్రక ప్రాంతం కొండవీడుపై మార్నింగ్ వాక్
- నగరవనం అభివృద్ధి పనులపై పరిశీలన
- పర్యాటక ప్రాంత పరిరక్షణ, ప్రగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని వెల్లడి



మార్నింగ్‌వాక్‌లో సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి

యడ్లపాడు: శతాబ్దాల చారిత్రక సంపదను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కొండవీడుకోట అభివృద్ధికి కృషి చేస్తోందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని కొండవీడుకోటను మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన సందర్శించారు. తొలుత కొండపై వివిధ రకాల మొక్కలు నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకంగా కొండవీడును తీర్చిదిద్దేందుకు చేపట్టిన ప్రగతి పనుల ఛాయాచిత్రాల ప్రదర్శనను తిలకించారు. వాటి వివరాలను పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు వివరించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి కొండవీడుపై ఉన్న స్వాగత ద్వారం, పురాతన ఆలయాలు, కట్టడాలు, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంలో చేస్తున్న పలు అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. అలాగే వ్యూపాయింట్స్ మార్గాల్లోనూ, వాకింగ్ ట్రాక్‌పైన 12 కి.మీ. మేర మార్నింగ్ వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై సాహస క్రీడల ఏర్పాటు అంశాలపై డెమో ప్రదర్శించారు. ఇందులో భాగంగా సీఎస్ నేతికొట్టు ఉన్న కొండపై ట్రెక్కింగ్‌లో పాల్గొని, విల్లు పట్టి బాణాలు సంధించారు.

అటు చారిత్రకం ఇటు పర్యాటకం

పర్యాటక ప్రదేశాల్లో కొండవీడుకోట రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంటుందని సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. మార్నింగ్ వాక్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కొండవీడు–నగరవనం కార్యక్రమంలో భాగంగా దశల వారీగా నిధులు విడుదల చేయడం తెలిసిందేనన్నారు. ఆయా నిధులతో సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పర్యాటకులను ఆకర్షించేలా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యువత కోసం సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకురావడం కొండవీడు ప్రగతికి తార్కాణమన్నారు. దశలా వారీగా ఇక్కడ జరిగే ఆయా అభివృద్ధి పనులు ఎంతో సంతృప్తి నిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ రాష్ట్ర దళాధిపతి వై.మధుసూదనరెడ్డి, జీవవైవిధ్య రాష్ట్ర బోర్డు చైర్మన్ డీఎంకే రెడ్డి, గుంటూరు అటవీ ముఖ్య సంరక్షణ అధికారి వై.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరరావు, పల్నాడు, గుంటూరు జిల్లా కలెక్టర్లు శివశంకర్ లోతేటి, వేణుగోపాల్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, కొండవీడుకోట అభివృద్ధి కన్వీనర్ కె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడికి విరాళాలు

విజయవాడ: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరిగే పలు సేవలకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. హైదరాబాద్ ఉస్మాన్‌నగర్‌కు చెందిన పెమ్మసాని శ్రీరామ్, శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116, శాశ్వత పూజలకు రూ.80 వేలు, గోసేవకు రూ.9 వేల విరాళాలు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మ వారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



విరాళం అందిస్తున్న దాతలు

అభివృద్ధికి రాజమార్గం

- శరవేగంగా జాతీయ రహదారి అభివృద్ధి పనులు
- పల్నాడుకే మణిహారంగా మారనున్న వైనం
- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి
- ప్రయాణం సులభతరం
- రూ.403.22 కోట్లతో పనులు



శరవేగంగా నిర్మాణమవుతున్న దాచేపల్లి-మాచర్ల జాతీయరహదారి

గురజాల: రహదారులు అభివృద్ధికి సోపానాలు. ఏ ప్రాంతంలోనైనా రహదారులు అభివృద్ధి చెందితేనే అన్ని రంగాలూ సర్వతోముఖాభివృద్ధి అయి ఆ ప్రాంతాల ప్రగతి సాధ్యమవుతుంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పల్నాడు ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే విద్య, వైద్యం, ఉపాధి పరంగా ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేకూర్చారు. తాజాగా సుమారుగా 40 కిలోమీటర్లు రాష్ట్ర రహదారిగా ఉన్న దాచేపలి–మాచర్ల మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చారు. ఇందుకు గాను రూ.403.22 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. పల్నాడు ప్రాంతానికి ఈ రహదారి ఎంతో కీలకంగా మారనుంది. పల్నాడు ప్రాంతంలో పలు సిమెంటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. అదేవిధంగా పలు కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు సిద్ధపడుతున్నాయి. రవాణా తేలిగ్గా జరగడంతో పాటు తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లేందుకు ఈ మార్గం సౌకర్యవంతంగా ఉంటుంది. అదే విధంగా ప్రకాశం, కృష్ణా, రాయలసీమ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. ఈప్రాంతంలో నాగార్జునసాగర్, అనుపు, ఎత్తిపోతల వంటి పర్యాటక ప్రాంతాలున్నాయి. సిమెంటు ఫ్యాక్టరీలు ఉండటంతో ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన ఘటనలు కోకొల్లలు. తాజాగా ఈ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో పల్నాడు ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి..

వెనుకబడిన పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సమష్టి కృషి తోనే సాధ్యమని పల్నాడు ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు నిరూపిస్తున్నారు. ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల సమష్టి కృషితోనే పల్నాడు ప్రాంతం అభివృద్ధికి బాటలు పడుతుందని రాజకీయవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ప్రాంతంలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన జరిగేలా చూస్తున్నారు.

పల్నాడు అభివృద్ధికి దోహదం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పల్నాడు ప్రాంతం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. జాతీయ రహదారి ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగం. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవతో కేంద్రం నుంచి నిధులు మంజూరై, వెంటనే పనులు ప్రారంభమవడం శుభపరిణామం.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే

మారనున్న పల్నాడు రూపురేఖలు



పల్నాడు ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. దాచేపల్లి – మాచర్ల రహదారిని జాతీయ రహదారిగా మార్చి, విస్తరించడం వలన ప్రయాణం సులభంగా ఉండటంతో పాటు ప్రమాదాలు నివారించవచ్చు. వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రహదారుల అభివృద్ధితోపాటు మెడికల్ కళాశాల ఏర్పాటుచేయడం పల్నాడు ప్రాంతం అభివృద్ధికి చిహ్నాలు.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల ఎమ్మెల్యే

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం

వేటపాలెం/చీరాల అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయడమే ధ్యేయంగా కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు పేర్కొన్నారు. వేటపాలెం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అశోక్‌బాబు గురువారం పరిశీలించారు. కార్యాలయంలోని రికార్డులు, మందులు పరిశీలించి, ఆరోగ్య కేంద్రంలో సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు–నేడు ద్వారా ప్రతి మండల కేంద్రంలో రెండు పీహెచ్‌సీలు ఉండేలా రూ.కోట్ల నిధులు ఖర్చు చేసి నూతన భవనాలు నిర్మించారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 53 వేల మంది వైద్యులను నియమించామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.40 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని చెప్పారు. ప్రతి కార్డుదారుడూ రూ.5 లక్షల లోపు ఉచిత వైద్యం పొందవచ్చని వెల్లడించారు. అనంతరం చీరాల జయంతిపేటలో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు గుండె ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోగా వారిని ఇంటికి వెళ్లి అశోక్‌బాబు పరామర్శించారు.



చీరాలలో గుండె ఆపరేషన్లు చేయించుకున్న భార్యాభర్తలను పరామర్శిస్తున్న అశోక్‌బాబు

క్లుప్తంగా

నేడు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో నేడు ఉమ్మడి ప్రకాశం జిల్లాల బాలబాలికల ఖోఖో జట్లు ఎంపిక జరుగుతుందని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 విభాగంలో బాలురు, బాలికలు, అండర్–19 విభాగంలో బాలుర జట్లు ఎంపిక జరుగుతుందని జిల్లా స్కూల్ గేమ్ సెక్రటరీ కె. వనజ, జిల్లా జూనియర్ కళాశాల సెక్రటరీ ఎం. ఆదినారాయణ తెలిపారు. వచ్చే నెల 20 నుంచి 22 వరకు చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి బాలబాలిక ఖోఖో పోటీలు జరుగుతాయని రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథ రెడ్డి తెలిపారు. బాలుర జట్టు పంగులూరు జూనియర్ కళాశాలలో, బాలికల జట్టు ఎంపిక కంచర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులకు మొత్తం 250 పాయింట్స్ లోపు ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలు కోసం 9848219080 సంప్రదించాలన్నారు.

చదరంగం పోటీలకు ఎస్వీఆర్ఎం విద్యార్థులు



నగరం: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎస్వీఆర్ఎం కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ వెల్లడించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో జరిగిన పోటీలలో కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఫణీంద్ర, గోపీకృష్ణలు ప్రతిభ కనబర్చి ఉమ్మడి గుంటూరు జిల్లా చదరంగం టీంకు ఎంపికయ్యారన్నారు. వీరివురు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ బుచ్చియ్యచౌదరి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈడీ సాంబమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి గుర్రం జాషువా సాహిత్యం

నివాళులర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్



నరసరావుపేట: కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి, కళా ప్రపూర్ణ గుర్రం జాషువా రచనలు సమాజానికి దిక్సూచికలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. గురువారం జాషువా 128వ జయంతి సందర్భంగా పట్టణంలోని పల్నాడురోడ్డులో గల విగ్రహానికి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జాషువా మనవడు సుశీల్‌కుమార్, శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, నరసరావుపేట రంగస్థలి అధ్యక్షులు షేక్ బాజితో కలిసి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జాషువా వినుకొండకు చెందిన వాసి కావటం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. అనేక రచనలతో దళిత, తెలుగుసాహిత్యంలో ఎనలేని కీర్తి గడించారన్నారు. గబ్బిలం, ఫిరదౌసీ, క్రీస్తుచరిత్ర తదితర రచనలు, ఖండ కావ్యాలు సాహిత్యానికి పట్టుగొమ్మలన్నారు. సామాజిక వాస్తవికత, దళితులు పడ్డ కష్టాలు స్వయంగా అనుభవించి రాయటంతో మంచి పేరు వచ్చిందన్నారు.

ప్రతినెలా సాహిత్య మేళ నిర్వహిస్తున్నామని, వచ్చే నెల జాషువా సాహిత్యం, సమాజానికి ఇచ్చిన సందేశంపై నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ వినుకొండ చాట్రగడ్డపాడులో జన్మించిన జాషువా సమాజంలో వేళ్లానుకొన్న కులరక్కసికి వ్యతిరేకంగా తన కవితలతో నిప్పులు చెరుగుతూ అనేక రచనలు చేశాడన్నారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రచనలు చేశాడన్నారు. టౌన్‌హాలులో జాషువా కళావేదిక ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన రచనలు చదివి ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, గిరిజన, ముదిరాజ్, మాదిగ సంక్షేమ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, ఇయం.స్వామి, కందుల ఎజ్రా, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, శ్రీనాథ సాహితీ పరిషత్ అధ్యక్షులు స్వర్ణ చినరామిరెడ్డి, టౌన్ బాప్టిస్టు చర్చి కార్యవర్గ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులలో కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అనుమతులు మంజూరు చేయగా మరో మూడు రోజులలో టెండర్లు పిలువనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన అచ్చంపేటలో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో చిట్టచివరగా ఉన్న అచ్చంపేట మండలం బ్రిడ్జి నిర్మాణంతో మొట్టమొదటి మండలం అవుతుందన్నారు. రెండు జిల్లాల మధ్య రాకపోకలు, వ్యాపార లావాదేవీలు కొనసాగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లేందుకు మార్గం సులభతరం అవుతుందని చెప్పారు. సమయం, వ్యయప్రయాసలు తగ్గిపోతాయని చెప్పారు. నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో రూ.1400కోట్లతో సంక్షేమ పథకాలు అందించామని, రూ.600కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. రూ.150కోట్లతో అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్‌రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నికల లోపే రూ.62కోట్లతో కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెడతామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలకు మంచి చేయడమే వచ్చని, మాజీ సీం చంద్రబాబుకు స్కాములు చేసి ప్రజాసొమ్మును కాజేయడం తెలుసునని చెప్పారు. స్కిల్ స్కాం కేసులో ఆధారాలతో సహా నిరూపణ కావడం వల్లనే చంద్రబాబు జైలుకెళ్లారని, ఎంత ప్రయత్నించినా బెయిల్ కూడా రావడం లేదన్నారు. ఇద్దరి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు వెంపా జ్వాలానరసింహారావు, సీహెచ్ఎస్సార్కే సాయిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు రావిశెట్టి రంగయ్య, సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, సర్పంచ్ కంభాల వీరబాబు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

కోటప్పకొండ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఆలయ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పాలక మండలి సభ్యులుగా మట్లా లింగారెడ్డి, దివ్వెల రామకృష్ణ, దొడ్డా అనురాధ, వంగపూడి జానయ్య, అట్లూరి సుబ్బాయమ్మ, మాడిశెట్టి స్వర్ణ, గుంటూరు లక్ష్మి, చిలంకూరి యోగేశ్వరరావు, మీనా సుమంత్, ఎక్స్ ఆఫీషియో సభ్యునిగా కొండ కావూరి అప్పయ్య గురుకుల్ చేత ఆలయ ఈఓ బి.శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ శైవక్షేత్రాల్లో కోటప్పకొండకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించే తిరునాళ్లకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని తెలిపారు. కోటప్పకొండ ఆలయ అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తమ ముద్ర ఉండేలా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

నరసరావుపేట–కోటప్పకొండ రహదారిని రూ.15 కోట్లతో విస్తరించినట్టు వివరించారు. దీంతోపాటు పమిడిమర్రు– జేఎన్‌టీయూ కళాశాల రోడ్డును రూ.4 కోట్లతో, కోటప్పకొండ–గురవాయపాలెం రోడ్డును రూ.కోటితో నిర్మించినట్టు తెలిపారు. కొండ దిగువన డివైడర్స్, సెంట్రల్ లైటింగ్, కొండపైన మేధా దక్షిణామూర్తి విగ్రహం, నంది విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్నదాన మండపం, డార్మెటరీ, వసతి గృహాలు భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. పాత కోటయ్య స్వామి ఆలయానికి రూ.4 కోట్లతో మెట్ల మార్గం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చిలకలూరిపేట మేజర్ కెనాల్ వద్ద శివకుటుంబాన్ని రూ.కోటితో నిర్మించి శివరాత్రికి అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశంపారపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటు

నరసరావుపేట: వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరమైందని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి బాలకృష్ణ, ఏపూరి గోపాలరావు విచారం వ్యక్తం చేశారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. తన పరిశోధనలతో మేలైన వరి, గోధుమ వంగడాలను సృష్టించారన్నారు. 1943లో బెంగాల్‌లో చోటు చేసుకున్న క్షామాన్ని చూసిన స్వామినాథన్ తన మనసు మార్చుకుని వ్యవసాయ పరిశోధనల వైపు అడుగులు వేశారన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం నియమించిన కమిటీలో స్వామినాథన్ కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. స్వామినాథన్ కరువు, రైతాంగ ఆత్మహత్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన కమిటీలో సభ్యుడిగా దేశం నలుమూలల పర్యటించి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేశారన్నారు. రైతులకు మద్దతు ధర, చట్టబద్ధత కోసం అవిశ్రాంతంగా పోరాడిన గొప్ప వ్యక్తిని వారు తెలిపారు. పెట్టుబడికి ఎంత ఖర్చు అవుతుందో దానికి అదనంగా 50శాతం ధర నిర్ణయించి మద్దతు ధర అమలు జరపాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసులు చేశారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేటపాలెం విద్యార్థులు



గ్రూప్ సాంగ్స్ పోటీలో విజేతలు

వేటపాలెం: జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో వేటపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని గురువారం ఉపాధ్యాయులు తెలిపారు. బుధవారం జిల్లా ప్రధాన కేంద్రం బాపట్లలో ఏజీ కళాశాల్లో ఏర్పాటు చేసిన యువజనోత్సవల సందర్భంగా విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన గ్రూప్ జానపద గీతాల నృత్యంతో పోటీతో పాటల పోటీల్లో విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీఈవో పల్లవి, బీఎస్ఓ ఎస్‌కే సదక్ మహమ్మద్, ఉపాధ్యాయులు ఎం.జనమ్మ, జీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న గ్రూప్ ఫోక్ సాంగ్ విజేతలు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ఆర్టీసీ ఆర్ఎం విజయ్‌కుమార్ రెడ్డి

బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆర్టీసీ ఆర్ఎం విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బాపట్ల ఆర్టీసీ డిపోలో గురువారం హెవీ డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించారు. ఆర్ఎం విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ప్రస్తుతం 16వ బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులకు ఈనెల 28 నుంచి 32 రోజులు పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ తరగతుల్లో స్కిల్స్ నేర్చుకుని తర్ఫీదు పొందిన డ్రైవర్లకు మాత్రమే లాంగ్ టిప్‌లను అప్పగించడం జరుగుతుందన్నారు. డ్రైవర్ బాధ్యత, డ్రైవర్‌కు ఉండాల్సిన లక్షణాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలు, రోడ్డు సింబల్స్ పై అవగాహన కల్పించారు. డ్రైవర్ బాధ్యతతో డ్రైవింగ్ చేస్తే కలిగే లాభాలు గురించి తెలియజేశారు. ఏపీఎస్ ఆర్టీసీలో శిక్షణకి గల ప్రాముఖ్యతను, ఆయిల్ సేవింగ్స్ పై డ్రైవర్లకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం శిక్షణకు హాజరైన డ్రైవర్లకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరావు, ఆర్టీసీ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

జాషువా ప్రతిభ అజరామరం

గుంటూరు వెస్ట్ : నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా ఆధునిక సమాజానికి దిక్సూచిలాంటివారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కొనియాడారు. జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు మందిరంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

తైక్వాండో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 220 మంది పోటీల్లో పాల్గొన్నారన్నారు. త్వరలోనే జట్టును ప్రకటించి రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. తొలుత పోటీలను వెంకటేశ్వరరావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్ వెంకటేశ్వరరెడ్డి, కొసనా వేణుగోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్ రంగా, కె.ప్రసాద్‌బాబు, దానేశ్వరరావు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ వెంకటేశ్వరరావు

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ. 89.52 లక్షలు

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల ఆదాయం రూ. 89,52,409 వచ్చినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సమక్షంలో గురువారం కానుకలు లెక్కించారు. నగదుతో పాటు బంగారం 48 గ్రాములు, వెండి ఒక కిలో 950 గ్రాములు, అమెరికన్ డాలర్లు 237, ఆస్ట్రేలియా డాలర్స్ 110, కెనడా డాలర్లు 10, బంగ్లాదేశ్ తుకస్ 76,195 కానుకల రూపంలో వచ్చినట్లు వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఎస్ఐ సీహెచ్ పద్మ, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

వేదాద్రి నరసింహునికి రూ. 30 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి బహిరంగ వేలం పాట ద్వారా రూ. 30.25లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం కొబ్బరికాయలు, కిరాణా సామగ్రి అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహించగా పై ఆదాయం వచ్చిందని తెలిపారు. ఏడాది పాటు వేలం పాట అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 37వ జాతీయ క్రీడలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్విమ్మింగ్ ఎంపిక పోటీలలో జగదీష్ మూడు రజిత, ఒక కాంస్య పతకం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. జగదీష్‌ను పలువురు అభినందించారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ ప్రదీప్
- జీజీహెచ్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుసుమ జీవన్ ప్రదీప్ అన్నారు. జీజీహెచ్ ఆవరణలో గురువారం అవయవ దానం ఆవశ్యకతపై ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్ మీదుగా తిరిగి జీజీహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో వివిధ కళాశాలల నుంచి దాదాపు 1200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన్ ప్రదీప్ మాట్లాడుతూ అవయవ దానంపై అనేకమందికి పలు రకాలుగా అపోహలు ఉన్నాయన్నారు. ప్రజల్లో అపోహలు పోగొట్టి అవగాహన పెంచాలన్నారు. అవయవ దానం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ అవయవ దానం గురించి ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. జీజీహెచ్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. రూ.25 లక్షలు విలువైన లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలను చేసేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దేశంలో ఐదు నుంచి పది లక్షల మంది అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని, అవయవాల కొరత ఉందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే అవయవాలను దానం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో అవయవ దానం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్

ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ

గుంటూరు ఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడంపై ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కాంట్రాక్టు లెక్చరర్లు అనే బానిస వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోకి వచ్చిందని తెలిపారు. కాంట్రాక్టు వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని అనేక సార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఏ ఒక్క ప్రభుత్వమూ హామీలు ఇవ్వడం తప్ప రెగ్యులరైజ్ చేయలేదని వివరించారు. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో పాటు ఆమోదింపచేయడం ద్వారా రాష్ట్రంలోని వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో కాంట్రాక్టు అధ్యాపకులనే బానిస వ్యవస్థను తొలగించి, పేద, బడుగు, బలహీనవర్గాల విద్యకు పెద్దపీట వేసినందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు సీఎం వై.ఎస్.జగన్‌కు రుణపడి ఉంటాయని తెలిపారు.

ఖోఖో పోటీలకు పేట కృష్ణవేణి విద్యార్థిని

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి మహిళా ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 27న ఖేలో ఇండియా రాష్ట్ర మహిళా ఖోఖో జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థిని అలేఖ్య అండర్–18 విభాగం జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలోని సెయింట్ జాన్‌బాస్కో బాలికల ఉన్నత పాఠశాలలో అక్టోబరు 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళా ఖోఖో పోటీలలో అలేఖ్య ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. అలేఖ్య ను కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని తదితరులు అభినందించారు.